క్లుప్తంగా

బడుగు బలహీనవర్గాలకు తోడ్పాటు అందించే బడ్జెట్‌

జమ్మలమడుగు : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ప్రవేశపెట్టిన 2023–2024 వార్షిక బడ్జెట్‌ పేద, బడుగు బలహీనవర్గాలకు తోడ్పాటు అందించే బడ్జెట్‌గా ఉందని చేనేత బీసీ సంఘం నాయకుడు బడిగించల చంద్రమౌళి అన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి ముందు చూపుగా చేసిన బడ్జెట్‌ అని ఆయన కొనియాడారు. చేనేతల అభ్యున్నతికి రూ.200 కోట్లు కేటాయించడం సంతోషకరమన్నారు.

ప్లాస్టిక్‌ కవర్లు వాడితే చట్టపరమైన చర్యలు


తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ తదితరులు

పులివెందుల టౌన్‌: ప్రభుత్వం నిషేదించిన ప్లాస్టిక్‌ కవర్లు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మురళీధర్‌ వ్యాపారస్తులకు సూచించారు. మున్సిపల్‌ కమిషనర్‌ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఆయన పలు హోటళ్లను తనిఖీ తనిఖీ చేసి సంతోష్‌ హోటల్‌లో వినియోగిస్తున్న ప్లాస్టిక్‌ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.2వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం: సింహాద్రిపురంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు వివిధ గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నారని.. ఆ శిబిరాలను పశువులు ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మంజునాథ్‌ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హిమకుంట్ల, లోమడ, చవ్వారిపల్లె, కసనూరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్యశిబిరంలో పశు గర్భ నిర్ధారణ, గొర్రెలు, మేకలకు నట్టల నివారణా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

డ్రోన్ల ద్వారా సమగ్ర భూ సర్వే


డ్రోన్‌ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్‌

లింగాల: మండలంలోని కోమన్నూతల గ్రామంలో గురువారం డ్రోన్‌ ద్వారా సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్‌ శేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే ద్వారా సమస్యలు పరిష్కరించబడతాయని.. రైతులకు శాశ్వత భూహక్కు లభిస్తుందన్నారు. డ్రోన్‌ ద్వారా రోజుకు సుమారు 3వేల ఎకరాలను సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల సర్వేయర్‌ శివనాయక్‌ ఆధ్వర్యంలో ప్రైవేట్‌ ఏజెన్సీ ఈ సర్వేని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ భూనిర్వాసితుల సమస్యలపై వినతి


ఏపీ జెన్‌కో ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్‌ పవర్‌ ప్రాజెక్టులోని భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఏపీ జెన్‌కో ఎండీ శ్రీధర్‌ను ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం.సుధీర్‌రెడ్డి కలసి విన్నవించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితుల జీవోపై కూడా చర్చించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


పదవ తరగతి విద్యార్థినికి పరీక్షా సామగ్రిని అందిస్తున్న హెడ్మాస్టర్‌, తదితరులు

లింగాల : పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని పాఠశాల హెడ్మాస్టర్‌ నాగమణి అన్నారు. ఓటీఎఫ్‌ ఆర్గనైజేషన్‌ సహకారంతో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని కోమన్నూతల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు హెడ్మాస్టర్‌ చేతుల మీదుగా పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్‌ మాట్లాడుతూ పరీక్షా సామగ్రి పంపిణీ చేయడంవల్ల విద్యార్థి మానసిక దృఢత్వంతో రెట్టింపు ఉత్సాహంగా పరీక్షలు రాసేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి మండల కో ఆర్డినేటర్‌ మస్తాన్‌బాషా, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న డ్రాగన్‌ ఫ్రూట్స్‌


అడవిచెర్లోపల్లెలో సాగులో ఉన్న డ్రాగన్‌ ఫ్రూట్‌ పంట

వీరపునాయునిపల్లె : వ్యవసాయం అంటే రైతులకు పెనుసవాల్‌గా మారుతున్న తరుణంలో డ్రాగన్‌ ఫ్రూట్‌ పంట కాసులు కురిపిస్తోంది. పంట సాగుపై ఇప్పుడిప్పుడే రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన అడవిచెర్లోపల్లె గ్రామానికి చెందిన ఓ యువ రైతు మూలి గంగిరెడ్డి నాలుగు సంవత్సరాలుగా డ్రాగన్‌ ఫ్రూట్‌ పంటను సాగుచేస్తున్నాడు. పంట సాగు చేసినప్పటి నుంచి మంచి లాభాలు పొందుతున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం మొక్కలకు అంటు కట్టి విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం మండలంలో దాదాపు 10 ఎకరాల్లో పంట సాగులో ఉంది. అడవిచెర్లోపల్లెలో 3.5, వీరపునాయునిపల్లెలో 5, గంగిరెడ్డిపల్లెలో 1.5 ఎకరాల్లో పంటను సాగు చేశారు. మార్కెట్‌లో ధర మంచిగా ఉండటంతో రైతులు పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

డ్రాగన్‌ ఫ్రూట్‌ పంటతో లాభాలు



కర్నాటక రాష్ట్రంలో సాగు చేసిన మొక్కలు మన ప్రాంతంలో ఎక్కువ వేడి వాతావరణం ఉండటంతో తట్టుకోలేవని తమిళనాడు రాష్ట్రంలోని కరకంబాడి నుంచి అంటు మొక్కలను ఒక్కో మొక్క రూ.100తో కొనుగోలు చేశాను. ఒక్కో ఎకరాకు 17 వందల నుంచి 18 వందల మొక్కలు నాటడం జరిగింది. ఎకరాకు దాదాపు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ఇక్కడే మొక్కలు అంటు కట్టి విక్రయిస్తున్నాను. ప్రస్తుతం 3.5 ఎకరాల్లో పంట ఉంది. మొక్క రూ.50కి విక్రయిస్తున్నాను. వ్యాపారులకు ఫ్రూట్స్‌ కేజీ రూ.150కి, పొలం దగ్గరికి వచ్చి రిటైల్‌గా కొనుగోలు చేసేవారికి రూ.200కు విక్రయిస్తున్నాను. ప్రస్తుతం వీరపునాయునిపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన రైతులకు మొక్కలను విక్రయిస్తున్నారు. పంట సాగులో ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకుంటున్నాను. పంట సాగు చేసినప్పటి నుంచి మంచి లాభాలను ఆర్జించడం జరుగుతోంది.

– మూలి గంగిరెడ్డి, రైతు (అడవిచెర్లోపల్లె)

ఉపాధి ద్వారా మొక్కలను అందిస్తున్నాం



ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్‌ ఫ్రూట్‌ మొక్కలను అందిస్తున్నామని, ఒక్కో రైతుకు 500 సెంట్లలో సాగు చేసుకునేందుకు మొక్కలతో పాటు వాటిని పెంచేందుకు అవసరమైనవి అందిస్తున్నాము. అంతే కాకుండా ఏడాది పాటు నిరంతరాయంగా పంట అందించే చిట్టి రోజాలు, జాస్మిన్‌ పంటలను ఎకరాలో సాగు చేసుకునేందుకు ఉపాధి ద్వారా అందిస్తున్నాము. ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– వెంకటసుబ్బయ్య, ఏపీఓ, ఉపాధిహామీ పథకం, వీరపునాయునిపల్లె

కాపులు, బీసీలు సీఎం వైఎస్‌ జగన్‌కే మద్దతు

- పవన్‌ కళ్యాణ్‌ కుల రాజకీయాలు మానుకో
- మున్సిపల్‌ ఛైర్మన్‌ వరప్రసాద్‌


విలేకరులతో మాట్లాడుతున్న బీసీ నాయకులు, మున్సిపల్‌ ఛైర్మన్‌ వరప్రసాద్‌, తదితరులు

పులివెందుల టౌన్‌ : కాపులు, బీసీలు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు అని.. పవన్‌ కళ్యాణ్‌ కుల రాజకీయాలు చేయడం మానుకోవాలని బీసీ నాయకులు, మున్సిపల్‌ ఛైర్మన్‌ వరప్రసాద్‌, రాయలసీమ కాపునాడు అధ్యక్షుడు సోపాల వీరా, బేల్దారి సంఘం మాజీ అధ్యక్షుడు పెద్ద వీరయ్య, కో ఆప్షన్‌ మెంబర్‌ చంద్రమౌళిలు తెలిపారు. గురువారం పులివెందులలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పవన్‌ కళ్యాణ్‌ కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా నిన్న సభలో వ్యాఖ్యానించడం దారుణమన్నారు. చంద్రబాబుకు దమ్ములేక పవన్‌ కళ్యాణ్‌ను వాడుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. దమ్ము ఉంటే 175 స్థానాలలో జనసేన పార్టీ పోటీ చేయాలన్నారు. జెండా పవన్‌ కళ్యాణ్‌ది అజెండా మాత్రం చంద్రబాబుది అని విమర్శించారు. చంద్రబాబుతో పవన్‌ కళ్యాణ్‌ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని కాపు కులాన్ని మూటగట్టి చంద్రబాబు చేతిలో పెట్టడం చాలా దారుణమన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంటే పవన్‌ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. చంద్రబాబుకు దమ్ములేక పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడటం చంద్రబాబు అవివేకానికి నిదర్శనమన్నారు. ఎన్ని గుంట నక్కలు ఎన్ని పన్నాగాలు పన్నినా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఆపలేరన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష అన్నారు. పవన్‌ కళ్యాణ్‌ కులాల మధ్య చిచ్చు పెట్టే ఆలోచనలు మానుకోవాలని వారు హితవు పలికారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించండి


వల్లూరులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు: గామ సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వల్లూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి కేంద్ర నిర్వహణ గురించి ఆరా తీశారు. సేకరించిన వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌, ఇతర మెటీరియల్‌ను వేరు చేసిన తరువాత వాటిని వీలైనంత త్వరగా అమ్మకం చేయడం ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చడానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది తప్పని సరిగా సమయ పాలన పాటించి అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు. తప్పని సరిగా డ్రస్‌ కోడ్‌ను పాటించాలని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని జంగంపల్లె గ్రామాన్ని సందర్శించి జగనన్న భూ రక్ష కార్యక్రమ రికార్డులను, మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసుకు ఘన నివాళి


మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్‌, ఎస్‌ఐ, తదితరులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన సచివాలయ మహిళా పోలీసు శ్యామల, ఆమె తల్లి రమణమ్మ ఇద్దరూ ప్రమాదవశాత్తు పీబీసీ కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ మహబూబ్‌బాషా, ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎన్‌ బ్రహ్మనందరెడ్డిలు గురువారం గురిజాల గ్రామానికి చేరుకుని శ్యామల, రమణమ్మ మృతదేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ మల్లారెడ్డి, మహిళా పోలీసు సిబ్బంది ప్రసన్నలక్ష్మి, విమల, కృష్ణలత, శ్రావణి, మాధవి, శిరీష, జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ


ఎగ్జామినేషన్‌ చీఫ్‌ రాజశేఖరరెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

లింగాల: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జరుగుతున్న ఇంటర్‌ పరీక్షా కేంద్రాన్ని గురువారం పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. బాలయోగి ప్రతిభా గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలకు చెందిన 107 మంది ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా..104 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామినేషన్‌ చీఫ్‌ రాజశేఖరరెడ్డి తెలిపారు. సీసీ కెమెరాల మధ్య పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయన్నారు. పరీక్షా కేంద్రంలో డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్‌గా నిత్య పూజితయ్య వ్యవహరించారు.

కమలాపురంలో.. 18 మంది గైర్హాజరు

కమలాపురం: ఇంటర్మీడియట్‌ పరీక్షల్లో రెండో రోజు 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రాల చీఫ్‌ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్‌ అధికారులు తెలిపారు. గురువారం సెకండ్‌ ఇంటర్‌ విద్యార్థులకు జరిగిన తెలుగు పరీక్షలో స్థానిక గురుకుల పాఠశాలలో 228 మందికి గాను 220 మంది హాజరయ్యారు. అలాగే పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్‌ కళాశాలలో 255 మందికిగాను 245 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అనిమెల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు హాజరుకాని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చురుగ్గా ఉండాలని సిబ్బందికి తెలిపారు. సచివాలయంలో సంక్షేమ పథకాలవారిగా, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి మంజూరుకాలేదన్న సమస్య రాకూడదన్నారు. గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు నరేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది.

ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌పై అవగాహన


వేంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తొండూరు: మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్‌ అరిఫుల్లా

వేంపల్లె: మండల పరిధిలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా డే సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ నిజాముద్దీన్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం, గ్రామీణ ప్రజల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్‌ విధానం, సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని.. ప్రజలు కూడా ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకుంటూ వైద్య, ఆరోగ్య సేవలు అందుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు ఆల్బెండజోల్‌ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌ ఎడ్యుకేటర్‌ షఫివున్నీషా, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఫ్యామిలీ ఫిజిషియన్‌ సేవలు అందాలి

తొండూరు : ప్రజలకు ఫ్యామిలీ ఫిజిషియన్‌ సేవలు వందశాతం అందాలని పీహెచ్‌సీ డాక్టర్‌ అరిఫుల్లా సూచించారు. గురువారం తొండూరు పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులు, తల్లీబిడ్డల ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మల్లయ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

జెఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌ వసుంధర


సీఎస్‌ఈ విద్యార్థులతో ప్రిన్సిపాల్‌ వసుంధర

పులివెందుల రూరల్‌ : రాబోయే సాంకేతికతలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జెఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌ వసుంధర తెలిపారు. గురువారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో టెక్‌ ఫెస్ట్‌ 2కె 23 కార్యక్రమంలో భాగంగా సీఎస్‌ఈ విభాగం హెచ్‌ఓడీ సరిత, మురళి ఆధ్వర్యంలో సీఎస్‌ఈ విద్యార్థులకు రెండవ రోజు ఎథికల్‌ హ్యాకింగ్‌, డేటా సైన్స్‌, మెర్న్‌స్టాక్‌ వర్క్‌ షాపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో జ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా జ్ఞానాన్ని పంచడంలో కూడా జెఎన్‌టీయూ విద్యార్థులు ముందుంటారన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ రమణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

లింగాల : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎల్‌పీఓ సురేంద్రనాథ్‌ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయన పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ఉదయం 9.30 గంటలకే సచివాలయాలలో బయోమెట్రిక్‌ హాజరు వేయాలన్నారు. ఉన్నతాధికారులు ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు నిర్వహించవచ్చునన్నారు. గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

త్యాగధనుడు అమరజీవి పొట్టి శ్రీరాములు



ఆర్టీపీపీలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, పులివెందులలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్‌ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్‌ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేసి అశువులు బాసిన గొప్ప త్యాగధనుడు అమరజీవి పొట్టి శ్రీరాములు చరిత్రలో నిలిచారని మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌ రెడ్డి తెలిపారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, ఆర్యవైశ్యులతో కలిసి ఆయన పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ పార్నపల్లె కిశోర్‌, కో ఆప్షన్‌ మెంబర్‌ చంద్రమౌళి, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఫుడ్‌, సైన్స్‌అండ్‌ టెక్నాలజీ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.ఎస్‌.భేగ్‌ ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆఫీసర్‌ ఇన్‌చార్జి జయమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ప్రకటించాలి

కమలాపురం : అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి సభ్యుడు రెడ్డి సురేష్‌ తెలిపారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో వెలసి ఉన్న రామాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని రాజధానిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. భారత స్వాతంత్య్ర సమరయోధుడు, దళితులకు ఆలయ ప్రవేశం కొరకు నాలుగు సంవత్సరాలు అహర్నిశలు పోరాడి దళితులకు సాంఘిక న్యాయం చేకూర్చిన సమతావాది పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంబటి సురేష్‌, ఆర్యవైశ్య నాయకులు కామిశెట్టి వెంకట రమణయ్య, బచ్చు సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో..

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాన్ఫరెన్స్‌ హాల్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు సోమశేఖర్‌రెడ్డి, దేవేంద్రనాయక్‌, టీ రవికుమార్‌, ఎన్‌.వెంకట్రావు, డి.వీరబాబు, ఏ సాంబశివరావు, ఎస్‌ శ్రీధర్‌, జీఎం ఫైనాన్స్‌ సి.వి.రమణరావు, ఫ్యాక్టరీ మేనేజర్‌ సిద్ధయ్య, యూనియన్‌ నాయకులు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్‌ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్‌, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్‌ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్‌ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్‌ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్‌ బాండిన చేస్తామ న్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్‌ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నల్లపురెడ్డిపల్లె విద్యార్థి ప్రతిభ


ట్రోఫీతో విద్యార్థి సాయిజశ్వంత్‌, తదితరులు

పులివెందుల రూరల్‌ : రాష్ట్రస్థాయి ప్రతిపాదిత పరీక్షలో మొదటి స్థానంలో నిలిచిన పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి సాయి జశ్వంత్‌కు ఏపీ పాఠశాల విద్యా కమిషనర్‌ సురేష్‌ కుమార్‌ చేతులమీదుగా రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందించారని జిల్లా సైన్స్‌ ఆఫీసర్‌ మహేశ్వరరెడ్డి తెలిపారు. సాయిజశ్వంత్‌ను పాఠశాల హెడ్మాస్టర్‌ కమలనాథశర్మ, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులు కూడా భవిష్యత్‌లో జరిగే పోటీ పరీక్షలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


అరుణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్‌ భాస్కర్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం: మండలంలోని పైడిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి భార్య అరుణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్‌ భాస్కర్‌రెడ్డి మృతురాలికి నివాళులర్పించారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వీఆర్‌ఏ మృతి

లింగాల : మండల పరిధిలోని ఒంటిఓబాయపల్లె గ్రామానికి చెందిన వీఆర్‌ఏ చల్లా కాటమయ్య(60) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. తహసీల్దార్‌ శేషారెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడికి భార్య గంగులమ్మ, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ ఆసరా మూడవ విడత డబ్బులు పంపిణీ


తొండూరులో మహిళకు కుంకుమ పెడుతున్న అధికారులు

తొండూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వైఎస్సార్‌ ఆసరా మూడవ విడత డబ్బులను అధికారులు అందజేశారు. గురువారం తొండూరులో ఇంటింటికీ వెళ్లి మహిళలకు కుంకుమ పెట్టి స్వీట్లు తినిపిస్తూ వైఎస్సార్‌ ఆసరా మూడవ విడత డబ్బులను ఉగాది పండుగను పురస్కరించుకుని మహిళలకు అందించినట్లు ఏపీఎం వెంకటనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీసీలు ఆంజనేయులు, గంగాధర, వీఓఏలు లత, చాంద్‌బాషా, బాలఓబయ్య, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె : రైతు వ్యతిరేఖ విధానాలపై ఈనెల 20వ తేదీన ఢిల్లీలోని జంతర్‌ మంతర్‌ వద్ద చేపట్టబోవు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. రైతుల మోటార్లకు విద్యుత్‌ మీటర్ల రద్దు, సమగ్ర పంటల బీమా పథకం అమలు, ఉద్యమం సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలనే డిమాండ్లపై ఆందోళన చేపట్టడం జరుగుతోందన్నారు.